PRGI REGN NO: APTEL/26/A3695

నేటి మినిట్ టు మినిట్

తెలుగు దిన పత్రిక

NETI MINUTE TO MINUTE

TELUGU DAILY

సంపుటి: 01 సంచిక :142 ఎడిషన్ : అనంతపురము మరియు సత్యసాయి జిల్లా, తేది : శుక్రవారం -06 నవంబర్ 2026, పేజీలు -4 వెల 1/-

VOLUME:01 ISSUE:142 EDITION: ANANTHAPURAMU, SATHYA SAI DIST. DATE: FRIDAY 06 NOVEMBER 2026 PAGES: 04 RS:01/

ముగిసిన పరిషత్

ఎన్నికల పోలింగ్..

నవంబర్ 7న ఓట్ల లెక్కింపు

582 జడ్పీటీసీ, 7,767 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు.. 2.61 కోట్ల మంది ఓటర్లు.. పలు జిల్లాల్లో ఘర్షణలు



పారా అథ్లెట్ల పోరాటం

దేశానికి స్ఫూర్తి

114 పతకాలతో భారత్ చరిత్రాత్మక ఘనత.. క్రీడాకారులతో ప్రధాని మోదీ ప్రత్యేక భేటీ



న్యూఢిల్లీ,నవంబర్ 05(నేటి మినిట్ టు మినిట్): ఆసియా పారా గేమ్స్-2026లో భారత క్రీడాకారులు సాధించిన చారిత్రాత్మక విజయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. పారా అథ్లెట్ల పోరాటం, పట్టుదల, అంకితభావం ప్రతి భారతీయుడికీ స్ఫూర్తినిస్తున్నాయని కొనియాడారు. గురువారం న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో పతక విజేతలతో ప్రత్యేకంగా సమావేశమై అభినందించారు.మోదీ మాట్లాడుతూ.. గతంలో పిల్లలు క్రీడలను వృత్తిగా ఎంచుకోవడానికి తల్లిదండ్రులు సంకోచించేవారని గుర్తుచేశారు.

మిగతా2లో...

మురసు తుపానుకు మత్స్యకారులు బలి

ప్రకాశం తీరానికి కొట్టుకొచ్చిన బోటు.. నలుగురి మృతదేహాలు లభ్యం



చంద్రబాబుపై అవినీతి కేసుల పిటిషన్..

ఈ నెల 10న విచారణ

- కేసులను సీబీఐకి బదిలీ చేయాలని పిల్.. హైకోర్టులో వాదనలు



అమరావతి, 05(నేటి మినిట్ టు మినిట్): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సంబంధించిన అవినీతి ఆరోపణల కేసులను సీబీఐకి బదిలీ చేయాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై ఈ నెల 10న విచారణ చేపట్టనున్నట్లు హైకోర్టు ప్రకటించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ నేతృత్వంలోని ధర్మాసనం గురువారం ఈ మేరకు విచారణను వాయిదా వేసింది. 2024లో ప్రభుత్వ మార్పు అనంతరం కేబీ గోపాలకృష్ణ తిలక్ ఈ పిల్ దాఖలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని సీఐడీ దర్యాప్తు చేస్తున్న కేసులను స్వతంత్రంగా విచారించేందుకు సీబీఐకి అప్పగించాలని పిటిషన్‌లో కోరారు. ఎస్సీ, ఎస్టీలకు చెందిన అసైన్డ్ భూముల బదలాయింపు, ఏపీ ఫైబర్‌నెట్ టెండర్లు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ఏర్పాటు, అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు భూసేకరణ, ఎక్సైజ్ విధానం, ఉచిత ఇసుక విధానానికి సంబంధించిన ఆరోపణలు ఈ కేసుల్లో ఉన్నాయి.పిటిషనర్ తరఫున

మిగతా2లో...



ఎన్నికల విధుల్లో విషాదం.. గుండెపోటుతో అధికారి మృతి

పోలింగ్ కేంద్రంలో అస్వస్థత.. ఆసుపత్రికి తరలిస్తుండగా కన్నుమూత

అమరావతి, 05(నేటి మినిట్ టు మినిట్): ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల విధుల్లో విషాదం చోటుచేసుకుంది. అనంతపురం జిల్లాలో పోలింగ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న హరిత గౌడ్ గుండెపోటుతో మృతి చెందారు. గురువారం కూడేరు మండలం కాడదారకుంటలో ఎన్నికల విధుల్లో ఉండగా ఆమెకు అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యారు.వెంటనే అక్కడి వైద్య సిబ్బంది ఆమెను కూడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

మిగతా2లో...

గల్లంతైన 16 మంది

సురక్షితం

- బేతుపల్లి ఘటనపై ఉత్కంఠకు తెర.. అర్ధరాత్రి సాహసోపేత రెస్క్యూ ఆపరేషన్



ఎన్నికల పేరుతో

అరాచకం

● చంద్రబాబుపై జగన్ ఫైర్ ● ఎన్నికల పేరుతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు: జగన్ ● నామినేషన్ల నుంచి పోలింగ్ వరకు అక్రమాలు.. పోలీసులు, అధికారులపై మాజీ సీఎం తీవ్ర ఆరోపణలు



అమరావతి,నవంబర్ 05(నేటి మినిట్ టు మినిట్): ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార కూటమి లబ్ధి పొందేందుకు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారు. నామినేషన్ల దశ నుంచి పోలింగ్ వరకు ప్రతి దశలోనూ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని విమర్శించారు. గురువారం తాడేపల్లిలోని తన నివాసంలో నిర్వహించిన మీడియా

మిగతా2లో...

కొడంగల్‌లో మూడు రోజుల పాటు

సీఎం రేవంత్ పర్యటన

రూ.9,053 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు.. 50 వేల మంది రైతులతో భారీ సభ



పోలీసులపై ఫిర్యాదులేవీ అందలేదు!

- జులై 20న జంతర్ మంతర్ నిరసనలపై సుప్రీంకోర్టుకు ఉన్నత స్థాయి కమిటీ నివేదిక



పారా అథ్లెట్ల పోరాటం దేశానికి స్ఫూర్తి

(మొదటి పేజీ తరువాయి)

క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు కేంద్ర ప్రభుత్వం క్రీడారంగంలో మౌలిక సదుపాయాలు, శిక్షణ, అవకాశాలను మెరుగుపరుస్తోందన్నారు. యువత కలలు, ప్రతిభ వృథా కాకుండా వ్యవస్థలో మార్పులు తీసుకొస్తున్నామని తెలిపారు.ఆసియా పారా గేమ్స్‌లో తొలిసారిగా 61 మంది భారత క్రీడాకారులు పాల్గొనడం విశేషమని మోదీ పేర్కొన్నారు. రెండు స్వర్ణ పతకాలు సాధించిన ఆర్చర్ శీతల్ దేవి, దృష్టిలోపాన్ని అధిగమించి అద్భుత ప్రదర్శన చేసిన అథ్లెట్ సిమ్రన్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ప్రస్తుత విజయాలతో ఆగిపోకుండా 2028 లాస్ ఏంజెలెస్ పారాలింపిక్స్‌లో మరిన్ని పతకాలు సాధించే లక్ష్యంతో ముందుకు సాగాలని క్రీడాకారులకు పిలుపునిచ్చారు. జపాన్‌లోని ఐచి-నగోయాలో ఇటీవల ముగిసిన ఆసియా పారా గేమ్స్‌లో భారత్ మొత్తం 114 పతకాలు సాధించి సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఇందులో 30 స్వర్ణాలు, 35 రజతాలు, 49 కాంస్య పతకాలు ఉన్నాయి. గతంలో భారత్ సాధించిన 108 పతకాల రికార్డును అధిగమించి అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసింది. ఈ విజయాల్లో 97 మంది భారత పారా అథ్లెట్లు భాగస్వాములయ్యారు.

పోలీసులపై ఫిర్యాదులేవీ అందలేదు!

- జులై 20న జంతర్ మంతర్ నిరసనలపై సుప్రీంకోర్టుకు ఉన్నత స్థాయి కమిటీ నివేదిక



న్యూఢిల్లీ,నవంబర్ 05(నేటి మినిట్ టు మినిట్): జంతర్ మంతర్ వద్ద జులై 20న జరిగిన నిరసనల సందర్భంగా పోలీసులు అరాచకత్వానికి పాల్పడ్డారంటూ భౌతికంగా గానీ, ఆన్‌లైన్‌లో గానీ ఎలాంటి ఫిర్యాదులు అందలేదని ఉన్నత స్థాయి విచారణ కమిటీ (హెచ్‌పీఈసీ) వెల్లడించినట్లు సుప్రీంకోర్టు తెలిపింది. అక్టోబర్ 31న సమర్పించిన చర్యల నివేదికలో ఈ విషయం పేర్కొన్నట్లు గురువారం కోర్టు వెల్లడించింది.పోలీసుల చర్యలకు సంబంధించిన వీడియో క్లిప్పులు, ఇతర ఆధారాలను కమిటీ పరిశీలనకు సమర్పించేందుకు పిటిషనర్లకు కోర్టు అవకాశం కల్పించింది. ఫిర్యాదులను అజ్ఞాతంగా నమోదు చేసేందుకు కమిటీ ప్రత్యేక పోర్టల్‌ను ప్రారంభించింది. నిరసనల సందర్భంగా పోలీసులు ఉపయోగించిన మందుగుండు సామగ్రి వివరాలను సమర్పించకపోవడంపై పిటిషనర్లు ప్రశ్నించారు.అందుబాటులో ఉన్న సమాచారాన్ని పరిశీలించి జాప్యం లేకుండా నివేదికలు ఇవ్వాలని కమిటీని సుప్రీంకోర్టు ఆదేశించింది. నెల రోజుల్లో తొలి నిజ నిర్ధారణ నివేదిక సమర్పించాలని స్పష్టం చేసింది. ఫిర్యాదుల కోసం నిరవధికంగా వేచి ఉండలేమని పేర్కొంటూ, ఈ కేసుపై డిసెంబర్‌లో మరోసారి విచారణ చేపట్టనున్నట్లు తెలిపింది.

ఎన్నికల విధుల్లో విషాదం.. గుండెపోటుతో అధికారి మృతి

(మొదటి పేజీ తరువాయి)

అత్యవసర చికిత్స అందించినప్పటికీ మధ్యాహ్నం 12.50 గంటలకు ఆమె తుదిశ్వాస విడిచారు. హరిత గౌడ్ రాయదుర్గం మండలంలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఎన్నికల విధుల్లో ఉండగానే ఆమె మరణించడంతో సహచర సిబ్బందిలో విషాదం నెలకొంది.హరిత గౌడ్ మృతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతాపం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఎన్నికల పేరుతో అరాచకం

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసులు, ఎన్నికల అధికారులు చంద్రబాబు ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించారని ఆరోపించారు.రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అరాచకాలు, దౌర్జన్యాలు, రిగ్గింగ్ చోటుచేసుకున్నాయని జగన్ పేర్కొన్నారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచే వైసీపీ అభ్యర్థులను అడ్డుకున్నారని, 2,109 ఎంపీటీసీ స్థానాల్లో తమ పార్టీ అభ్యర్థులను నామినేషన్లు వేయనివ్వలేదని ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీ పోటీలో నిలవలేని పరిస్థితులు సృష్టించారని విమర్శించారు.ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను కూడా ప్రభుత్వం పట్టించుకోలేదని జగన్ అన్నారు. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియల్లోనూ అక్రమాలు జరిగాయని ఆరోపించారు. పోలింగ్ రోజున వైసీపీ ఏజెంట్లను కేంద్రాల్లో కూర్చోనివ్వకుండా అడ్డుకున్నారని, కొన్ని ప్రాంతాల్లో వారిపై దాడులకు పాల్పడ్డారని తెలిపారు. ఓటర్లను ఓటు హక్కు వినియోగించుకోకుండా అడ్డుకోవడంతో పాటు రిగ్గింగ్‌కు పాల్పడ్డారని విమర్శించారు.తెక్కలి, కోటబొమ్మాళి నుంచి దర్శి, కనిగిరి, పలమనేరు వరకు పలు ప్రాంతాల్లో ఎన్నికల అక్రమాలు చోటుచేసుకున్నాయని జగన్ ఆరోపించారు. పులివెందుల నియోజకవర్గంలోని వేముల, లింగాల మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొందన్నారు. ఎన్నికల విధుల్లో పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించారని, ప్రతిపక్ష కార్యకర్తలపై బలప్రయోగం చేశారని విమర్శించారు.రాష్ట్రంలో జరుగుతున్నది నిజమైన ఎన్నికలా? లేక అధికార పార్టీ అభ్యర్థులను ఎంపిక చేసుకునే ప్రక్రియనా? అని జగన్ ప్రశ్నించారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోయిన చంద్రబాబు ప్రభుత్వం, ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను ఎదుర్కొనేందుకు అడ్డదారులు తొక్కుతోందని ఆరోపించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం వైసీపీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో జరిగినట్లు తాము చెబుతున్న అక్రమాలకు సంబంధించిన వీడియోలను మీడియా సమావేశంలో ప్రదర్శించిన జగన్, ఎన్నికల నిర్వహణలో సంస్కరణలు అవసరమని పేర్కొన్నారు.

చంద్రబాబుపై అవినీతి కేసుల పిటిషన్.. ఈ నెల 10న విచారణ

(మొదటి పేజీ తరువాయి)

సీనియర్ న్యాయవాది రంజిత్ వాదిస్తూ.. కేసుల్లో ఫిర్యాదుదారులుగా ఉన్నవారు ప్రభుత్వ అధికారులు కావడంతో, చంద్రబాబు అధికారంలో ఉండటంతో మూసివేత నివేదికలను సవాలు చేసేందుకు ముందుకు రావడం లేదని కోర్టుకు తెలిపారు. అందువల్ల కేసులపై స్వతంత్ర పరిశీలన అవసరమని పేర్కొన్నారు.మరోవైపు ప్రభుత్వం, సీఐడీ తరఫున వాదించిన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ.. దర్యాప్తు సంస్థలు తగిన ఆధారాలు లేవని నివేదికలు సమర్పించాయని, విజయవాడ ఏసీబీ కోర్టు వాటిని పరిశీలించి కేసులను మూసివేసిందని వివరించారు. ఇప్పటికే కొన్ని మూసివేత ఉత్తర్వులను సవాలు చేస్తూ పిటిషన్లు దాఖలయ్యాయని తెలిపారు. పిల్‌ను కొట్టివేయాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను నవంబర్ 10కి వాయిదా వేసింది.

మురసు తుపానుకు మత్స్యకారులు బలి

ప్రకాశం తీరానికి కొట్టుకొచ్చిన బోటు.. నలుగురి మృతదేహాలు లభ్యం

ప్రకాశం:నవంబర్ 05(నేటి మినిట్ టు మినిట్): మురసు తుపాను ప్రభావంతో సముద్రంలో గల్లంతైన తమిళనాడు మత్స్యకారుల బోటు ప్రకాశం జిల్లా కొత్తపట్నం తీరానికి కొట్టుకొచ్చింది. ఈ బోటులో నలుగురి మృతదేహాలు లభ్యమయ్యాయి. మరో ఐదుగురు మత్స్యకారుల ఆచూకీ కోసం కోస్ట్‌గార్డ్, మెరైన్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.చెన్నైలోని కాశిమేడు నుంచి అక్టోబర్ 29న తొమ్మిది మంది మత్స్యకారులు వేటకు వెళ్లారు. మురసు తుపాను హెచ్చరికల నేపథ్యంలో వారి బోట్లను ఆంధ్రప్రదేశ్ తీరంలోని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అయితే నవంబర్ 3న నిజాంపట్నం వద్ద ఉన్న బోటులోని తొమ్మిది మంది రామాయపట్నం వైపు బయలుదేరారు. మార్గమధ్యంలో తీవ్ర గాలులు, అలల ఉధృతికి బోటు ప్రమాదానికి గురై గల్లంతైంది. గురువారం కొత్తపట్నం తీరంలో మూడు మృతదేహాలు కొట్టుకురాగా, మరో మృతదేహాన్ని గాలింపు చర్యల్లో గుర్తించారు. మృతదేహాలను ఒంగోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిగిలిన ఐదుగురి కోసం కోస్ట్‌గార్డ్ నౌక, హెలికాప్టర్ ద్వారా గాలిస్తున్నారు. మృతదేహాలను చట్టపరమైన ప్రక్రియ అనంతరం తమిళనాడు అధికారులకు అప్పగించనున్నట్లు ప్రకాశం జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు.

గల్లంతైన 16 మంది సురక్షితం

సత్తుపల్లి,05(నేటి మినిట్ టు మినిట్): ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి పెద్దచెరువు వద్ద బుధవారం సాయంత్రం మొదలైన ఉత్కంఠ చివరకు సుఖాంతమైంది. చెరువులో చిక్కుకున్న ఎనిమిది మంది మత్స్యకారులను రక్షించేందుకు వెళ్లిన ఎన్డీఆర్ఎఫ్ బృందం పడవ బోల్తా పడటంతో మత్స్యకారులతో పాటు సహాయక సిబ్బంది కూడా చెరువులో చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలు వెంటనే రంగంలోకి దిగి అర్ధరాత్రి వరకు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించాయి. చీకటిని సైతం లెక్కచేయకుండా మొత్తం 16 మందిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చాయి.రెస్క్యూ సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా అందరూ క్షేమంగా బయటపడ్డారు. ఘటన జరిగినప్పటి నుంచి కలెక్టర్ దివాకర టీఎస్, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ రాత్రంతా చెరువు వద్దే ఉండి పరిస్థితిని పర్యవేక్షించారు. బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ సూచనలు అందించారు. రెస్క్యూ ఆపరేషన్‌ను విజయవంతం చేసిన ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బందిని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందించారు. ఎమ్మెల్యే మట్టా రాగమయి కృషిని, జిల్లా అధికారుల పనితీరును ప్రశంసిస్తూ రెస్క్యూ బృందాలకు ప్రభుత్వం తరఫున ధన్యవాదాలు తెలిపారు.

కొడంగల్‌లో మూడు రోజుల పాటు సీఎం రేవంత్ పర్యటన

హైదరాబాద్,నవంబర్ 05(నేటి మినిట్ టు మినిట్): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 7, 8, 9 తేదీల్లో తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో మూడు రోజుల పాటు పర్యటించనున్నారు. ఈ సందర్భంగా మెగా రైతు మేళా, పారిశ్రామిక ప్రదర్శనను ప్రారంభించడంతో పాటు రూ.9,053.48 కోట్లతో చేపట్టనున్న 13 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. అలాగే రూ.46.08 కోట్లతో నిర్మించిన 10 ప్రభుత్వ భవనాలను ప్రారంభించనున్నారు.ఈ నెల 7న హకీంపేటలో మెగా రైతు మేళా, పారిశ్రామిక ప్రదర్శనను సీఎం ప్రారంభిస్తారు. రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో సమావేశమై ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, మార్కెటింగ్ అవకాశాలపై చర్చిస్తారు.

పారిశ్రామికవేత్తలతోనూ సమావేశం కానున్నారు.8న స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమవుతారు. లగచర్ల ఇండస్ట్రియల్ కారిడార్‌లో రూ.81 కోట్లతో నిర్మించనున్న పామాయిల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేస్తారు. రూ.5,060 కోట్ల రేడియల్ రోడ్డు, రూ.2,100 కోట్ల ఎత్తిపోతల పథకం రెండో దశ, రూ.1,410 కోట్లతో 223 బీటీ రహదారుల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. వ్యవసాయ కళాశాల, తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, ఆధునిక బస్టాండ్ల తదితర అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు.

పూర్తయిన పాఠశాలలు, కళాశాలలు, పోలీస్ స్టేషన్లు, ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ భవనాలను కూడా ప్రారంభిస్తారు.పర్యటన చివరి రోజైన 9న హకీంపేటలో భారీ రైతు బహిరంగ సభ నిర్వహించనున్నారు.

ఈ సభకు పది జిల్లాల నుంచి సుమారు 50 వేల మంది రైతులు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు సభా ప్రాంగణం, రైతుమేళా, పారిశ్రామిక ప్రదర్శన వద్ద ఏర్పాట్లు ముమ్మరం చేశారు. భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించారు.

ముగిసిన పరిషత్ ఎన్నికల పోలింగ్.. 7న ఓట్ల లెక్కింపు!

అమరావతి,నవంబర్ 05(నేటి మినిట్ టు మినిట్): ఆంధ్రప్రదేశ్‌లో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ నవంబర్ 5, గురువారం సాయంత్రం 5 గంటలకు ముగిసింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్‌లో ఓటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం 5 గంటలకు క్యూలైన్లలో ఉన్నవారికి కూడా ఓటు వేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా 582 జడ్పీటీసీ, 7,767 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 21,012 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఈ ఎన్నికల్లో సుమారు 2.61 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అర్హులుగా ఉన్నారు. రాష్ట్రంలోని 659 జడ్పీటీసీ స్థానాల్లో 77 స్థానాలు ఏకగ్రీవం కాగా, మిగిలిన 582 స్థానాలకు పోలింగ్ జరిగింది. అదేవిధంగా 9,821 ఎంపీటీసీ స్థానాల్లో 2,051 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 7,767 స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. జడ్పీటీసీ స్థానాల్లో 2,169 మంది, ఎంపీటీసీ స్థానాల్లో 18,843 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా 31,460 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి ఎన్నికల నిర్వహణకు సుమారు 2.52 లక్షల మంది సిబ్బందిని నియమించారు.

పలు జిల్లాల్లో ఘర్షణలు

పోలింగ్ సందర్భంగా కడప, కర్నూలు, తిరుపతి, అనంతపురం తదితర జిల్లాల్లో చెదురుమదురు ఘర్షణలు చోటుచేసుకున్నాయి. కొన్ని ప్రాంతాల్లో రాజకీయ పార్టీల కార్యకర్తల మధ్య వాగ్వాదాలు, రాళ్ల దాడులు జరిగినట్లు వార్తలు వెలువడ్డాయి. కడప జిల్లా పులివెందుల మండలం ఎర్రిపల్లెలో రోడ్డుపై పెట్రోల్ బాంబు పేలిన ఘటన కలకలం రేపింది. తిరుపతి జిల్లాలోని పెనగలూరు మండలం నల్లపురెడ్డిపల్లిలోనూ ఇలాంటి ఘటన జరిగినట్లు సమాచారం.కర్నూలు జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ప్రత్యర్థి వర్గాల మధ్య రాళ్ల, సీసాల దాడులు జరగడంతో పలువురికి గాయాలయ్యాయి. అనంతపురం జిల్లాలోని కూడేరు మండలం మరుట్ల పోలింగ్ కేంద్రం నుంచి బ్యాలెట్ బాక్సును తీసుకెళ్లినట్లు ఆరోపణలు రావడంతో ఉద్రిక్తత నెలకొంది. కొన్ని చోట్ల పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. మరోవైపు, రాష్ట్రవ్యాప్తంగా 15 జిల్లాల్లో 37 చిన్న ఘటనలు నమోదైనట్లు డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా వెల్లడించారు. విస్తృత భద్రతా ఏర్పాట్లతో పోలింగ్ నిర్వహించినట్లు తెలిపారు.

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

ఎన్నికల నిర్వహణ కోసం 40,679 మంది పోలీసు సిబ్బందిని రంగంలోకి దించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అదనపు బలగాలను మోహరించారు. సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్, వీడియో చిత్రీకరణతో పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను నిబంధనల ప్రకారం భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించి, ఎలక్ట్రానిక్ నిఘా ఏర్పాటు చేశారు.

నవంబర్ 7న ఫలితాలు

ఈ ఎన్నికలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు నవంబర్ 7న నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 365 కేంద్రాల్లో 9,062 లెక్కింపు బల్లలను ఏర్పాటు చేయనున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. లెక్కింపు ప్రక్రియ కోసం సుమారు 52 వేల మంది సిబ్బందిని నియమించనున్నారు. ఓట్ల లెక్కింపు అనంతరం జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఫలితాలు వెల్లడికానున్నాయి.

ఓటర్ల జాబితా సవరణ గడువు పొడిగింపు

- **ఆరు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియకు అదనపు సమయం**

న్యూఢిల్లీ,నవంబర్ 05(నేటి మినిట్ టు మినిట్): ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఆరు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మరింత విస్తరించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, హర్యానా, నాగాలాండ్‌తో పాటు ఢిల్లీలో ఈ ప్రక్రియకు సంబంధించిన గడువులను పొడిగించింది. తెలంగాణలో ఓటర్ల నుంచి వచ్చే అభ్యంతరాలు, దరఖాస్తుల పరిష్కారానికి నవంబర్ 26 వరకు గడువు ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్, హర్యానాలో నవంబర్ 20 వరకు, నాగాలాండ్‌లో నవంబర్ 25 వరకు గడువు పొడిగించింది. మహారాష్ట్రలో అభ్యంతరాలు, దరఖాస్తుల స్వీకరణను డిసెంబర్ 13 వరకు కొనసాగించనున్నారు. ఈ రాష్ట్రాల్లో తుది ఓటరు జాబితాలను నవంబర్ 30న ప్రకటించనున్నారు.ఢిల్లీలో అభ్యంతరాల స్వీకరణ గడువును డిసెంబర్ 25 వరకు పొడిగించగా, తుది ఓటరు జాబితాను డిసెంబర్ 22న విడుదల చేయనున్నారు. ఓటర్ల జాబితాలో అర్హులైన వారందరికీ అవకాశం కల్పించడంతో పాటు అభ్యంతరాలను పరిష్కరించేందుకు ఈ గడువు పొడిగింపు చేపట్టినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది.



అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి


- పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ ఏ. సిరి



కర్నూలు నవంబర్ 05(నేటి మినిట్ టు మినిట్): అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పిలుపునిచ్చారు.గురువారం జిల్లాలో నిర్వహిస్తున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు కోడుమూరు, దేవనకొండ, పత్తికొండ మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పోలింగ్ నిర్వహణ, ఓటింగ్ శాతం, ఎన్నికల రికార్డులను పరిశీలించి, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రిని పోలీసు భద్రత నడుమ స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించి భద్రపరచాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో ఆదోని ఆర్డీవో అరుణదేవి, ఎన్నికల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన లింగాల జడ్పీటీసీ ఎన్నికలు

● పార్నపల్లిలో స్వల్ప ఉద్రిక్తత ● భారీ పోలీసు బందోబస్తు





లింగాల, నవంబర్ 05(నేటి మినిట్ టు మినిట్): లింగాల జడ్పీటీసీ స్థానానికి గురువారం నిర్వహించిన ఎన్నికలు స్వల్ప ఉద్రిక్తత మినహా ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని 19 గ్రామపంచాయతీల పరిధిలో 33 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. ఓటర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.టీడీపీ అభ్యర్థి యమ్మనూరు సరళాదేవి ఇంటిఓబాయపల్లిలో, వైసీపీ అభ్యర్థి పెద్దమల్లు శ్రీదేవి పెద్దకుడాలలో ఓటు వేశారు.పార్నపల్లిలో స్వల్ప ఉద్రిక్తత పార్నపల్లి గ్రామంలో వైసీపీ ఏజెంట్లను పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లకుండా టీడీపీ నేతలు అడ్డుకుంటున్నారనే ఫిర్యాదుతో ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి గ్రామానికి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే డీఎస్పీ మురళీ నాయక్ ఆయనను గ్రామ సమీపంలోనే నిలువరించారు. కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొన్న అనంతరం పరిస్థితి సద్దుమణగడంతో ఎంపీ వెనుదిరిగారు.పటిష్ట పోలీసు బందోబస్తుఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్పీ నచికేతన్ ఆదేశాల మేరకు డీఎస్పీ మురళీ నాయక్, రూరల్ సీఐ శాంతిలాల్, ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో 10 మంది అదనపు సీఐలు, ఎస్ఐలు, 200 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.

టక్కోలులో జోరుగా.. పొన్నవోలులో మందకొడిగా ఎంపీటీసీ పోలింగ్

- టక్కోలు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఆర్డీవో



సిద్ధవటం, నవంబర్ 05(నేటి మినిట్ టు మినిట్): సిద్ధవటం మండలంలోని పొన్నవోలు, టక్కోలు ఎంపీటీసీ స్థానాలకు గురువారం జరిగిన ఎన్నికల్లో టక్కోలు పరిధిలో అధిక పోలింగ్ నమోదు కాగా, పొన్నవోలులో పోలింగ్ మందకొడిగా సాగింది. రెండు ఎంపీటీసీ స్థానాలకు మొత్తం 8 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. టక్కోలు ఎంపీటీసీ పరిధిలోని నాలుగు కేంద్రాల్లో 3,745 ఓట్లకు గాను 2,630 ఓట్లు పోలైయ్యాయి. పొన్నవోలు పరిధిలో 2,693 ఓట్లకు గాను 1,195 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. పి.కొత్తపల్లి 27వ పోలింగ్ కేంద్రంలో 755 ఓట్లకు గాను 350 ఓట్లు పోలై 46.3 శాతం నమోదైంది. పొన్నవోలు ఎంపీటీసీ స్థానంలో టీడీపీ అభ్యర్థి జ్యోతి శివారెడ్డి, వైసీపీ అభ్యర్థి సౌరెడ్డి విజయలక్ష్మి మధ్య పోటీ నెలకొనగా, టక్కోలు స్థానంలో స్వతంత్ర అభ్యర్థులు సింగం పద్మావతి, బత్తెన లక్ష్మీదేవి పోటీపడ్డారు. టక్కోలు గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని కడప ఆర్డీవో మురళి సందర్శించి ఎన్నికల సరళిని పరిశీలించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై హారిక ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పత్తికొండలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ ఏ. సిరి



పత్తికొండ, నవంబర్ 05(నేటి మినిట్ టు మినిట్): పత్తికొండ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి గురువారం పరిశీలించారు. పోలింగ్ సరళి, ఓటింగ్ నిర్వహణ తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటర్ల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆమె సూచించారు.

వేంపల్లెలో జడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎన్నికల పోలింగ్ ప్రశాంతం

పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు

61.24 పోలింగ్ శాతం నమోదు



వేంపల్లె నవంబర్ 05(నేటి మినిట్ టు మినిట్): వేంపల్లి మండలంలో గురువారం జడ్పీటిసి, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ చెదురుమదురు సంఘటన మినహా ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో 45942 ఓట్లు ఉండగా వేంపల్లి తో పాటు 17 గ్రామ పంచాయతీల్లో 56 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల పోలింగ్ జరిగింది. అలిరెడ్డి పల్లె ఎంపీటీసీ స్థానానికి భాజపా అభ్యర్థి ముద్ది శివకృష్ణ, ఇండిపెండెంట్ అభ్యర్థి దేవర్ల రామచంద్ర మధ్య పోటీ జరిగింది.ఈ ఎంపిటిసి పరిధిలో ఉన్న ఓటర్లు జడ్పిటిసి కి ఒక ఓటు, ఎంపీటీసీ కి ఒక ఓటు వేశారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో చిన్న చిన్న వివాదాలు మినహా స్వేచ్ఛగా సాఫీగా ఎన్నికలు పోలింగ్ జరిగింది. మండల వ్యాప్తంగా 61.24 శాతం కింద 28147 ఓటు పోలయ్యాయి. వేంపల్లి కడప రిమ్స్ సిఐలు నరసింహులు రాజగోపాల్ నేతృత్వంలో విస్తృత పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి ఎక్కడ ఎలాంటి చిన్న సమస్యలు తలెత్తకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. అలి రెడ్డి పల్లె ఎంపీటీసీ పరిధిలో 875 ఓట్లు ఉండగా 692 ఓట్లు పోలయ్యాయి. ఇందు ఇందులో అలిరెడ్డి పల్లెలో 400, తుమ్మపల్లిలో 2092 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ సరళిని వైకాపా జనసేన జడ్పిటిసి అభ్యర్థులు బెస్త లక్ష్మీదేవి, బత్తల వెంకట శివమ్మలు పరిశీలించారు. అలాగే తెదేపా తరపున మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి, మండల కన్వీనర్ రామ మని రెడ్డి, పులివెందుల జనసేన ఇన్చార్జి హరీష్, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, వైకాపా తరపున మాజీ జెడ్పిటిసి సభ్యుడు రవికుమార్ రెడ్డి, మండల వైకాపా కన్వీనర్ చంద్ర ఓబుల్ రెడ్డి మాజీ సర్పంచులు సింగారెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, రాచనేని శీను, మాజీ జెడ్పిటిసి సభ్యుడు షబ్బీర్ వలి తదితర నేతలు పరిశీలించారు.

ఎన్నికల ప్రక్రియ అపహాస్యం.. రీపోలింగ్ నిర్వహించాలి

- పోలీసుల అండతో అక్రమాలు, వైసీపీ నేతలపై అక్రమ కేసులు: ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి



పులివెందుల,నవంబర్ 05(నేటి మినిట్ టు మినిట్): రాష్ట్రంలో జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణలో ప్రభుత్వం విఫలమైందని, ఎన్నికలు కాకుండా సెలక్షన్‌లా సాగాయని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి విమర్శించారు. గురువారం పులివెందులలోని వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పోలీసుల అండతో టీడీపీ నాయకులు అక్రమాలకు పాల్పడ్డారని, వైసీపీ నేతలపై అక్రమ కేసులు నమోదు చేసి అరెస్టులు చేశారని ఆరోపించారు.నామినేషన్ల నుంచి పోలింగ్, కౌంటింగ్ వరకు ప్రతి దశలోనూ పోరాడాల్సి వచ్చిందని ఆయన అన్నారు. ఏజెంట్లు, ఓటర్లను పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించలేదని, పార్నపల్లి, ఎర్రిపల్లి, వేముల ప్రాంతాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. వేములలో ఆరు పోలింగ్ బూత్‌లలో ఉదయం నుంచి సాయంత్రం వరకు రిగ్గింగ్ జరిగిందని, ఎస్పీ అక్కడే ఉన్నప్పటికీ అక్రమాలు ఆగలేదని పేర్కొన్నారు.ఎన్నికల తీరుపై వైసీపీ అభ్యర్థులు ఇప్పటికే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారని తెలిపారు. రీపోలింగ్ నిర్వహించేలా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ఎన్నికల అధికారుల నుంచి న్యాయం జరగకపోతే కోర్టును ఆశ్రయించి ఎన్నికలను రద్దు చేయించే వరకు పోరాడతామని అవినాష్ రెడ్డి స్పష్టం చేశారు.

జడ్పీటీసీ ఎన్నికల్లో ఉద్రిక్తత

పెట్రోల్ బాంబులు, రాళ్ల దాడులు

పలు గ్రామాల్లో ఘర్షణలు

వైసీపీ కార్యకర్తలకు స్వల్ప గాయాలు



ఎన్నికల సందర్భంగా నెలకొన్న ఉద్రిక్తతలతో స్థానికంగా ఆందోళన వాతావరణం ఏర్పడింది.

పులివెందుల టౌన్, నవంబర్ 05(నేటి మినిట్ టు మినిట్): పులివెందుల మండలంలో గురువారం జరిగిన జడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా పలు గ్రామాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మండల పరిధిలోని ఎర్రిపల్లె గ్రామంలో వైసీపీ శ్రేణులపై టీడీపీ మద్దతుదారులు పెట్రోల్ బాంబులతో దాడి దాడి చేసుకున్నారుఅలాగే రాగిమానిపల్లి, అచ్చువెల్లి గ్రామాల్లో ఇరువర్గాల మధ్య రాళ్ల దాడులు జరిగినట్లు తెలిసింది. మండలవ్యాప్తంగా చోటుచేసుకున్న ఘర్షణల్లో పలువురు వైసీపీ కార్యకర్తలకు స్వల్ప గాయాలైనట్లు తెలుస్తోంది. అలాగే పులివెందుల మండలంలోని నలుపు రెడ్డి పల్లి గ్రామం నందు కూడా సాయంత్రం ఎన్నికల సమయం సమయానికి కొద్దిగా ఘర్షణ వాతావరణం ఏర్పాటు అయింది అక్కడ పోలీసులు రంగ ప్రవేశం చేసి ఎలాంటి ఘర్షం జరగకుండా చదరగొట్టారు వరుస ఘటనలతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురయ్యారు.

ఆరు బూత్‌లలో అక్రమాల ఆరోపణలు..రీపోలింగ్‌కు డిమాండ్.!

ఏజెంట్లను అడ్డుకున్నారంటూ వైఎస్సార్‌సీపీ ఆగ్రహం

ఓటర్లను భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపణ

నాగేళ్ల సత్య ప్రభావతమ్మ ఆదేశాలతో ఆర్వోకు ఫిర్యాదు చేసిన వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు



వేముల నవంబర్ 05(నేటి మినిట్ టు మినిట్): వేముల మండల కేంద్రంలో జరిగిన జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్‌పై తీవ్ర వివాదం నెలకొంది. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు చోటుచేసుకున్నాయని, వైఎస్సార్‌సీపీ పోలింగ్ ఏజెంట్లను అడ్డుకోవడంతోపాటు ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసి పోలింగ్‌ను ప్రభావితం చేశారని వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు,అభ్యర్థులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో వేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 16, 17, 18, 19, 20, 21 నంబర్లతో కూడిన ఆరు పోలింగ్ బూత్‌లలో రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ వేముల మండల జడ్పీటీసీ అభ్యర్థి నాగేళ్ల సత్య ప్రభావతమ్మ ఆదేశాల మేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులుకు వినతిపత్రం సమర్పించారు.గురువారం జరిగిన పోలింగ్ సందర్భంగా వైఎస్సార్‌సీపీకి చెందిన పోలింగ్ ఏజెంట్లను కూటమి నాయకులు పోలీసులను అడ్డుపెట్టుకుని పోలింగ్ కేంద్రాల్లోకి రాకుండా అడ్డుకున్నారని ఆరోపించారు.తమ పార్టీ ఏజెంట్లకు అవకాశం కల్పించకుండానే ఎన్నికల అధికారులు, టీడీపీ నాయకులు కుమ్మక్కై అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు.ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరగాల్సి ఉండగా అధికార పార్టీ నాయకులకు అనుకూలంగా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు.మరోవైపు వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ఉన్న ఓటర్లను ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు వెళ్లకుండా అడ్డుకోవడంతోపాటు, వారి ఓటరు స్లిప్పులను సైతం లాక్కొని భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు.ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునే పరిస్థితి లేకుండా చేశారని మండిపడ్డారు.ఈ మేరకు నాగేళ్ల సత్య ప్రభావతమ్మ ఆదేశాలతో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు,అభ్యర్థులు వేముల ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆర్వో శ్రీనివాసులును కలిసి జరిగిన పరిణామాలను వివరించారు. ఆరు పోలింగ్ కేంద్రాల్లో ఏజెంట్లను అడ్డుకోవడం, ఓటర్లను భయపెట్టడం, ఎన్నికల నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.వివాదాస్పదమైన ఆరు పోలింగ్ బూత్‌లలో రీపోలింగ్ నిర్వహించి ఓటర్లకు న్యాయం చేయాలని వినతిపత్రంలో స్పష్టం చేశారు. వినతిపత్రంపై స్పందించిన ఆర్వో శ్రీనివాసులు ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్‌తో చర్చించి, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకునేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు వైఎస్సార్‌సీపీ ప్రతినిధులు తెలిపారు.

ఎస్పీ కార్యాలయం మెట్లపై మాజీ మంత్రి శైలజానాథ్ బైఠాయింపు

శింగనమల నియోజకవర్గంలో పర్యటించకుండా పోలీసులు అడ్డుకుంటున్నారని ఆరోపణ

హౌస్ అరెస్ట్ నుంచి తప్పించుకుని ఎస్పీ కార్యాలయానికి చేరుకున్న శైలజానాథ్

ఎస్పీ జగదీష్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు కార్యాలయం వద్ద నిరీక్షణ

ఎస్పీ వచ్చే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదంటున్న మాజీ మంత్రి

పోలీసుల తీరుపై శైలజానాథ్ నిరసన.. ఎస్పీ కార్యాలయం మెట్లపైనే బైఠాయింపు

నియోజకవర్గ పర్యటనకు అనుమతి లేదా? పోలీసుల తీరుపై మాజీ మంత్రి అసహనం

శింగనమల పర్యటన అడ్డంకులపై ఎస్పీకి ఫిర్యాదు చేసేందుకు శైలజానాథ్ పట్టు





ఎస్పీ కార్యాలయం మెట్లపైనే నిరసన

అనంతపురం, నవంబర్ 05(నేటి మినిట్ టు మినిట్): శింగనమల నియోజకవర్గంలో పర్యటించకుండా పోలీసులు అడ్డుకుంటున్నారంటూ వైసీపీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి శైలజానాథ్ నిరసనకు దిగారు. తనను పోలీసులు హౌస్ అరెస్ట్ చేసి నియోజకవర్గ పర్యటనకు వెళ్లకుండా అడ్డుకుంటున్నారని ఆయన ఆరోపించారు. పోలీసుల ఆంక్షలను తప్పించుకుని జిల్లా ఎస్పీకి వినతిపత్రం అందించేందుకు అనంతపురంలోని జిల్లా ఎస్పీ కార్యాలయానికి చేరుకున్నారు. అయితే ఎస్పీ కార్యాలయానికి వచ్చిన శైలజానాథ్ కార్యాలయ మెట్లపై కూర్చుని నిరసన తెలిపారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు, నియోజకవర్గంలో పర్యటించేందుకు వెళ్తున్న తనను పోలీసులు అడ్డుకోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయంపై జిల్లా ఎస్పీ జగదీష్‌కు వినతిపత్రం అందించి తన సమస్యను వివరించాలని నిర్ణయించుకున్నారు. జిల్లా ఎస్పీ జగదీష్ స్వయంగా వచ్చి తనను కలిసే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని శైలజానాథ్ స్పష్టం చేస్తూ ఎస్పీ కార్యాలయం మెట్లపైనే వేచి ఉన్నారు. ఆయన నిరసనతో ఎస్పీ కార్యాలయం వద్ద కొంతసేపు ఉత్కంఠ నెలకొంది.

ఎన్నికల విధులే ప్రాణం తీశాయా? పోలింగ్ కేంద్రంలో ఉపాధ్యాయురాలు మృతి

- **ఓటు పండుగ వేళ విషాదం.. విధుల్లో ఉండగానే టీచర్ మృతి**
- **ఆర్వో అనుమతి జాప్యం.. ఆసుపత్రికి చేరేలోపే ఉపాధ్యాయురాలు మృతి?**
- **ఎన్నికల డ్యూటీలో విషాదం.. అస్వస్థతతో కుప్పకూలిన హరిత**
- **కడదరకుంట పోలింగ్ కేంద్రంలో కలకలం.. విధులు నిర్వహిస్తూ టీచర్ మృతి**



అనంతపురం జిల్లా, కూడేరు,నవంబర్ 05(నేటి మినిట్ టు మినిట్): ఎన్నికల విధులు నిర్వహించేందుకు వెళ్లిన ఓ ఉపాధ్యాయురాలు పోలింగ్ కేంద్రంలోనే అస్వస్థతకు గురై మృతి చెందిన విషాద ఘటన అనంతపురం జిల్లా కూడేరు మండలంలో చోటుచేసుకుంది. విధి నిర్వహణలో ఉండగానే ప్రాణాలు కోల్పోవడంతో ఉపాధ్యాయ వర్గాల్లో విషాదం నెలకొంది.వివరాల్లోకి వెళితే.. కూడేరు మండలం కడదరకుంట గ్రామంలో ఎన్నికల విధుల నిమిత్తం ఎస్. హరిత గౌడ్ హాజరయ్యారు. ఆమె రాయదుర్గం మండలం ఖాదలూరులో ఎస్‌జీటీ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. ఎన్నికల విధుల్లో ఉండగా అకస్మాత్తుగా అస్వస్థతకు గురై తీవ్ర ఆయాసంతో కుప్పకూలిపోయారు.ఆమెకు షుగర్ లెవల్స్ తగ్గిపోవడంతో ఆరోగ్య పరిస్థితి విషమించినట్లు తెలుస్తోంది. అక్కడే ఉన్న ఆశా కార్యకర్తలు, సిబ్బంది ఆమెను ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. అయితే, విధుల నుంచి వెళ్లేందుకు రిటర్నింగ్ అధికారి (ఆర్వో) అనుమతి తీసుకొని బయలుదేరుతానని హరిత చెప్పినట్లు సమాచారం. అనుమతి ప్రక్రియలో జాప్యం జరిగినట్లు తెలుస్తోంది.అనంతరం ఆమెను హుటాహుటిన కూడేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు సమాచారం.ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సమయంలో ఉపాధ్యాయురాలు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని నింపింది. విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది ఆరోగ్య పరిస్థితుల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఈ ఘటన మరోసారి గుర్తు చేస్తోంది. హరిత మృతి పట్ల సహచర ఉపాధ్యాయులు, స్థానికులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.

గెలుపు కోసం గోల... చివరికి బాక్సుల బద్దలు

ఓటు వేయాల్సిన చేతులతోనే బ్యాలెట్ బాక్సులు బద్దలు

రిగ్గింగ్ అనుమానమా.. రాజకీయ రగడా? మరుట్లలో బాక్సుల విధ్వంసం

బ్యాలెట్ బాక్సులు పగిలాయి.. ప్రజాస్వామ్యం రోడ్డున పడింది


ఓట్ల లెక్క తేలకముందే.. బాక్సుల బద్దలాట

మరుట్లలో ఓట్ల యుద్ధం.. బాక్సులే బలిపశువులు

పోలింగ్ బూత్‌లో పోరు.. బయటకు వచ్చిన బ్యాలెట్ పత్రాలు

రిగ్గింగ్ ఆరోపణలతో రణరంగంగా మరుట్ల.. రీపోలింగ్‌కు రంగం సిద్ధం





ఉరవకొండ, కూడేరు:నవంబర్ 05(నేటి మినిట్ టు మినిట్): అనంతపురం జిల్లా కూడేరు మండలం మరుట్ల గ్రామంలో ఎన్నికల పోలింగ్ వేళ తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. రిగ్గింగ్ జరుగుతోందనే అనుమానాలు, ఆరోపణలతో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఏకంగా బ్యాలెట్ బాక్సులను పోలింగ్ కేంద్రం నుంచి బయటకు తీసుకొచ్చి పగలగొట్టడంతో అందులోని బ్యాలెట్ పత్రాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. దీంతో గ్రామంలో ఒక్కసారిగా కలకలం రేగింది.**బ్యాలెట్ బాక్సులు బయటకు.. ఓట్లు చెల్లాచెదురు**మరుట్ల గ్రామంలో సుమారు 700 మంది ఓటర్లు ఉండగా, తొలుత దాదాపు 400 ఓట్లు పోలైనట్లు సమాచారం. పోలింగ్ శాతం పెరుగుతున్న సమయంలో రిగ్గింగ్ జరుగుతోందనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీంతో కొందరు పార్టీ నేతలు, కార్యకర్తలు పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి బ్యాలెట్ బాక్సులను బయటకు తీసుకొచ్చి ధ్వంసం చేసినట్లు ఆరోపణలు వినిపించాయి. బాక్సులు పగలడంతో అందులోని వైసీపీ, టీడీపీకి సంబంధించిన బ్యాలెట్ పత్రాలు బయటపడి చెల్లాచెదురుగా పడిపోయాయి. దీంతో అసలు ఏం జరుగుతోందన్న ప్రశ్నలు తలెత్తాయి.**సీఐ రాజు విధులకు ఆటంకం?**ఈ ఘటనతో పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నించిన పోలీసులకు కూడా ఆందోళనకారుల నుంచి ఆటంకాలు ఎదురైనట్లు తెలుస్తోంది. కూలర్ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన సీఐ రాజు విధులకు ఆటంకం కలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు సమాచారం. విధులను అడ్డుకున్న వారిపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేసినట్లు తెలిసింది.**రీపోలింగ్‌కు అధికారుల నిర్ణయం**పోలింగ్ కేంద్రంలో బ్యాలెట్ బాక్సులు ధ్వంసం కావడం, రిగ్గింగ్ ఆరోపణలు వెల్లువెత్తడంతో ఎన్నికల అధికారులు పరిస్థితిని పరిశీలించారు. ఈ నేపథ్యంలో మరుట్ల పోలింగ్ కేంద్రంలో రీపోలింగ్ నిర్వహించేలా అధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.ప్రజాస్వామ్య పద్ధతిలో ఓటు వేయాల్సిన ఎన్నికల వేళ బ్యాలెట్ బాక్సుల ధ్వంసం, పరస్పర ఆరోపణలు, పోలీసుల విధులకు ఆటంకం వంటి పరిణామాలు ప్రజల్లో ఆందోళన కలిగించాయి. అసలు రిగ్గింగ్ జరిగిందా? లేక అనుమానాలతోనే బాక్సులను ధ్వంసం చేశారా? అన్నది అధికారుల విచారణలో తేలాల్సి ఉంది.

అవినాష్ రెడ్డి ఆరోపణలకు బీటెక్ రవి కౌంటర్

- టీడీపీపై ఆరోపణలు చేసే ముందు గత ఘటనలను గుర్తు చేసుకోవాలి



పులివెందుల, నవంబర్ 05(నేటి మినిట్ టు మినిట్): ప్రతి చిన్న సంఘటనకు టీడీపీపై రిగ్గింగ్, దౌర్జన్యాలు, పోలీసుల వేధింపులంటూ ఆరోపణలు చేయడం వైఎస్ అవినాష్ రెడ్డికి అలవాటుగా మారిందని టీడీపీ నేత బీటెక్ రవి విమర్శించారు.లింగాల మండలంలో జడ్పీటీసీ ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగాయని ఆయన పేర్కొన్నారు. అయితే పులివెందుల మండలంలోని ఎర్రిపల్లె, వేముల ప్రాంతాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, రాళ్ల దాడులు జరిగాయని, వాహనాలు ధ్వంసం చేశారని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు.ఒకవైపు టీడీపీపై ఆరోపణలు చేస్తూ, మరోవైపు తమ పార్టీ నాయకులపై జరిగిన దాడులను పట్టించుకోకపోవడం ఏమిటని అవినాష్ రెడ్డిని ప్రశ్నించారు. ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో రాజకీయ ఆరోపణలకు స్వస్తి పలికి పులివెందుల నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని బీటెక్ రవి సూచించారు.

“ గోవిందరెడ్డి ఓటు కోసం గోట్కూర్‌లో స్వామి దర్శనం “

- **అయ్యప్ప మాలలో ఉండి దొంగ ఓటు వేసేందుకు యత్నం**
- **దొంగ స్వామి ఎవరు..? గోట్కూర్‌లో దొంగ ఓటు కలకలం**
- **అయ్యప్ప మాలలో వచ్చి.. గోవిందరెడ్డి పేరుతో ఓటు వేసే యత్నం?**
- **గోట్కూర్ పోలింగ్ కేంద్రంలో అనుమానాస్పద వ్యక్తి.. విచారణకు డిమాండ్**
- **ఓటు ఎవరిది..? వేసేందుకు వచ్చింది ఎవరు..? గోట్కూర్‌లో చర్చనీయాంశం**
- **ఎన్నికల వేళ అక్రమాలకు తెరలేపారా..? అధికారుల విచారణకు స్థానికుల డిమాండ్**



అనంతపురం జిల్లా, కూడేరు:నవంబర్ 05(నేటి మినిట్ టు మినిట్): ఎన్నికల పోలింగ్ వేళ అనంతపురం జిల్లా కూడేరు మండలం గోట్కూర్ గ్రామంలో దొంగ ఓటు వ్యవహారం కలకలం రేపింది. అయ్యప్ప మాలలో ఉన్న ఓ వ్యక్తి మరో వ్యక్తి పేరుతో ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.వివరాల్లోకి వెళితే.. అయ్యప్ప మాల ధరించిన ఓ వ్యక్తి గోట్కూర్ గ్రామంలోని పోలింగ్ కేంద్రానికి వచ్చి గోవిందరెడ్డి పేరుతో ఓటు వేయడానికి వచ్చినట్లు చెప్పినట్లు సమాచారం. అనంతరం పోలింగ్ సిబ్బందికి ఓటరు స్లిప్ అందించి పోలింగ్ బూత్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. అయితే అక్కడి పరిస్థితుల నేపథ్యంలో ఓటు వేయకుండానే వెనుదిరిగినట్లు స్థానికుల ద్వారా సమాచారం.అసలు గోవిందరెడ్డి పేరుతో వచ్చిన వ్యక్తి ఎవరు? సంబంధిత ఓటరు స్థానంలో మరొకరు ఓటు వేసేందుకు ప్రయత్నించారా? ఈ వ్యవహారం వెనుక ఎవరైనా ఉన్నారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత అత్యంత కీలకం. ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వచ్చినప్పుడు ఎన్నికల అధికారులు తక్షణమే స్పందించి విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది. పోలింగ్ కేంద్రంలోని సీసీటీవీ ఫుటేజీ, ఓటరు జాబితా, సిబ్బంది వివరాలను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.ఈ ఘటనపై ఎన్నికల అధికారులు సమగ్ర విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది.. దొంగ ఓట్లకు తావులేకుండా ఎన్నికల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

M/S SUNIL PUBLICATIONSPrinting Press (Name & Address)PrinterM/S SUNIL PUBLICATIONS D.NO.: 28-5-782, HOUSING BOARD COLONY, REVENUE WARD NO. 28, ANANTAPUR., ANDHRA PRADESH - 515001.